# విప్లవ మేధావి

(గల్పిక)

సాయుధ విప్లవం ద్వారా తప్ప దేశానికి విముక్తి లేదని అందరు మార్క్సిస్టులూ నమ్మినట్టే గణాచారి కూడా నమ్మాడు. సిద్ధాంత సాహిత్యమంతా కంఠస్థం చేశాడు.

అయితే దురదృష్టవశాత్తూ గణాచారికి రెండు ఇబ్బందులు ఎదురయాయి. ఒకటి, అట్టడుగు వర్గాలలో రాజకీయ చైతన్యం— విప్లవ చైతన్యం దాకా పోకుండానే — అంతగా లేదని గణాచారి అనుయాయులు భావించారు గణాచారికి తుపాకీపట్టి బూర్జువా పెట్టుబడిదారీ తైనాతీల నందరినీ కాల్చిపారెయ్యాలని ఉన్నా, తనకు ఆ శక్తి లేదని అతనికి తెలుసు.

అందుచేత ఏం చెయ్యాలి? ప్రజలలో విప్లవ బీజాలు నాటి, విప్లవోత్సాహం రేకెత్తించే సారస్వతం సృష్టించాలి ఆ సారస్వతం అక్కడక్కడా ఉన్న విప్లవకారులకు ఎంతో సహాయంగా ఉంటుంది.

సారస్వత కార్యక్రమం సాగింది. అందులో గణాచారి విశిష్ట పాత్ర వహించాడు. తన రచనలు తాను మళ్ళీ మళ్ళీ చదువుతుంటే విప్లవావశ్యకత ప్రజలకు అరటిపండు ఒలిచి పెట్టినట్టుగా స్పష్టమయింది. దానినిండా లెనిన్ కొటేషన్లూ, మార్క్స్ కొటేషన్లూ, మావో కొటేషనూ కొల్లలుగా ఉన్నాయి. దేశీయుల కొటేషన్లు అంతగా లేవు.

గణాచారికి రోజురోజుకూ ఆవేశం హెచ్చుతున్నది. ఒకవంక విప్లవం దేశం నాలుగు చెరగులా అంటుకున్నది. విప్లవ రచనలతో ఇంక పనిలేదు. అతను ఓ మంచిరోజు చూసి, నినాదాలిచ్చుకుంటూ విప్లవ స్థావరానికి బయలుదేరాడు. దురదృష్టవశాత్తూ అంతకుముందే పోలీసులు ఆ స్థావరంలో ఉన్న చంటిపిల్లల దగ్గిర నుంచీ అందర్నీ పోలీసువాన్‌లో కుక్కి, అడవిలోకి తీసుకుపోయి, ఇంక వెళ్లండని చెప్పి, వెనకనుంచి అందర్నీ కాల్చేశారు. ఎందుకంటే, ఎమర్జన్సీయా, మాటలా?

గణాచారి ఆశ్చర్యపోయి, తన వెనక వస్తున్న లక్షలాది జనంకోసం చూశాడు. ఒక్క పురుగులేదు. కామ్రేడ్‌లు అరణ్యంలో దాక్కొనోయారేమోనని ఇంకా ముందుకు సాగాడు. ఎదురుగా వస్తూ పోలీసువాన్ కనిపించింది.

**కొడవటిగంటి కుటుంబరావు**